


దుర్గ:

ఆరోజు వాతావరణానికి ముసురు పట్టింది.

ఖైము ఆరవ్వస్తోంది.

కాన్వరు ఆస్పత్రి గేటుముందు అసహనంగా నిల్చుంది దుర్గ.

నలిగిన చీర—

అలిసిపోయిన కళ్ళు—

వెలుగులేని మొహం—

నీరసం నిండిన దేహం—

తన్ని రోజూ వాడిగ్గా తీసికెళ్ళే రిక్షా ఇంకా రాలేదు. ఆమెలో కంగారు ఎక్కువైంది. పిల్లల్ని చూడాలన్న గుబులు మొదలయింది.

మరో రిక్షా బేరం ఆడింది.

రిక్షా ఎక్కేముందు ఆమెకళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయ్! హాస్పిటల్ లో బెడ్ మీద నిస్సత్తువగా పడున్న ప్రకాశం ఆలోచనలు ఆమెని ముసిరాయ్! ఆయనకు నయమవుతుందా?

ఆమె మనసు బాధగా మూల్గింది!

రిక్షా ముందుకు సాగింది. ఆమె భర్త ఆలోచనలనుంచి దూరంగా కదిలింది.

లక్డీకాపూల్ దాటి రవీంద్రభారతి వైపు తిరిగింది రిక్షా. దుర్గ మనసులో పిల్లలు మెదిలారు.

'అమ్మా! నాన్న ఎప్పుడొస్తాడే!'

తను రిక్షా దిగకుండానే పిల్లలడిగే మొదటి ప్రశ్న అది.

'వస్తారమ్మా! జ్వరం తగ్గగానే వచ్చేస్తారు'

తనది 'షేపు' చేసిన జవాబు,

మభ్యపెట్టే మాత్ర.

అంతకన్నా తను చేయగలిగింది మాత్రం ఏముందిగనక? కనిపించని దేముణ్ని మొక్కటం తప్ప-కనిపించే దేముడి కోసం.

వెంకట్రామయ్య:

గేటుముందు ఆగిన రిక్షాలోంచి దిగిన కోడల్ని చూశారు వెంకట్రామయ్యగారు.

'ఎంత చిక్కిపోయింది?'

ఆయన మనసు బాధపడింది.

ముప్పై ఏకూడా దాటని ముత్తైదువలో ఎంతో ఓర్పు చూడగల్గుతున్నారు ఆయన.

తల్లికోసం ఎదురు చూస్తూ గేటు ముందు కూర్చుంటారు తన యిద్దరి మనవరాళ్ళు—

పెద్దది రమ; చిన్నది ఉమ.


పెద్దదానికి అన్నీ తండ్రి పోలికలే. దాన్ని చూస్తుంటే వెంకట్రామయ్యగారికి హాస్పిటల్ లో వున్న తన పెద్దకొడుకు మనసులో మెదులుతాడు.

ఎంత అభిమానం వాడికి తల్లిదండ్రులమీద. తనలాగ పట్టుదలేం

తక్కువలేదు వాడిలో!"

తను రిటైరయేముందు ఒకసారి ఏలూరు వచ్చాడు అకస్మాత్తుగా. వాడికి వాళ్ళమ్మ రాసిందిట-రిటైరయాక ఢిల్లీలో ఉన్న చిన్న కొడుకు దగ్గరకు వెళ్దామనుకుంటున్నామని.

అంతే-నాల్రోజులు తనదగ్గర బైఠాయించి వాడి దగ్గరకే ముందు వచ్చేలా వాగ్దానం చేయించుకొనిగాని మరీ కదిలాడు కాదు.




తనకి అదేనేమో ఆఖరుసారి-వాడిని ఆనందంగా చూడటం.

తను రిటైరయి హైదరాబాదుచేరటం: ప్రకాశాన్ని క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్చటం-దాదాపు ఒకేసారి జరిగాయ్.


జబ్బు బాగా ముదిరి పోయిందని. ఆయువు పోయలేకపోయినా మరికొన్ని నెలలు మాత్రమే అతన్ని బ్రతికించుకోవచ్చని డాక్టర్లు వెంకట్రామయ్యగారికి ప్రయివేటుగా చెప్పినప్పుడు ఆయన ఆ గదిలోనే వలవలా ఏడ్చేశారు. అన్నీ తెలిసున్నా వాళ్ళ చేతులు పట్టుకొని మరీ మరీ ప్రాధేయపడ్డారు-ప్రకాశానికి ఎలాగయినా ప్రాణం పోయమని.

అప్పట్నుంచీ ఆ భయంకరమైన నిజాన్ని ఆయనలోనే దాచుకున్నారు.

ఆనిజానికిప్పుడు మూడునెలల వయసు: ప్రకాశం:

దూరంగా గంటలు వినిపిస్తున్నాయ్:

లెక్క పెట్టాడు ప్రకాశం
తొమ్మిది!
జీవితంలో తనవి ఆఖరి ఘడియలు
తన పాత్రకి తెర పడబోతోంది
చావంటే తనలో ఇదివరకటి భయం లేదు—బ్రతుకుతాడన్న ఆశలేదుగనక
అది ఉన్న రోజుల్లో జీవితంమీద తీపి ఉండేది
తనూ — తన వాళ్ళు, చుట్టాలు— స్నేహితులు, వాళ్ళని చూడాలనే తపన— చూడని రోజు బాధ
ఇన్నాళ్ళు తనకి తోడంటూ ఉండేది
ఇప్పుడు - తను ఒంటరి
అతి ప్రయత్నంతో అందరిమీదా మమతలు చంపుకున్నాడు — తెంచుకున్నాడు
కానీ ఎంత విదిలించుకుందామన్నా, తెంచుకుందామన్నా తెగని బంధం అయి కూర్చుంది—దుర్గ
తనే సర్వం అయిన తన భార్యకి చీకటి మిగిల్చిపోతున్నాడు ఆమె జీవితంలో నిప్పులు కురవబోతున్నాయ్! తన చావు ఆమెకి శాపంకాబోతోంది! ఆ ఆలోచనే తన్ని పీడిస్తోంది! వేధిస్తోంది! బాధిస్తోంది!
తలుపు చప్పుడయితే ఆసక్తిగా అటు చూశాడు ప్రకాశం
ఎదురుగా అతని చూపులకి మసగ్గా కనిపించింది దుర్గ
దుర్గ
కొన్ని రోజుల్నుంచీ దుర్గ రూపంలో మార్పొచ్చింది
ఎంబ్రాయిడరీ చేసిన నైలెక్స్ చీర!
స్లీవ్‌లెస్ బ్లౌజ్!
కంటినిండా కాటుక!
సింగార్ బొట్టు!
జడలో కుప్పలా మల్లెపూలు!
ఒంటిమీద ఇంటిమేట్ సెంటు!
ఇదివరలా ఆమెలో బరువు బాధలు కనిపించటంలేదు
పిల్లలంటే చిరాకు పడుతోంది
ఆ పరిస్థితుల్లో ఆమెలో వచ్చిన 'వింత మార్పు' అందరి ఆలోచనల్లో మేకై కూర్చుంది.
ప్రకాశం
కాలం పదిహేనురోజుల్ని హరించింది
క్యాన్సర్ ప్రకాశాన్ని హరిస్తోంది
చాకచక్యంగా-చదరంగంలో పావుల్ని తిన్నట్టు
తిన్నచోట తినకుండా—
ఉన్నచోట ఉండకుండా—
పాకుతోంది
ఒకచోటక్కాదు—పదిచోట్లకి
పరుగెడుతోంది — ఊరికే కాదు— పొడుస్తూ—సూదుల్లా-కాదు—గునపాల్లా
ఒంట్లో ఏమీ మిగల్చకుండా—
ఒంటిమీద కనిపించకుండా!
ప్రకాశం ఇప్పుడు ఏమీ తినడంలేదు- క్యాన్సర్ అతన్ని తినేస్తోంది
దుర్గ
ఉక్రోషంతో తలుపులు భడాల్న మూసింది దుర్గ
తలుపులయితే మూసిందిగాని అత్తగారి మాటలు ఇంకా ఆమె చెవుల్లో గంటల్లా మ్రోగుతున్నాయ్
మామగారి చూపులు ఆమెని చీల్చేస్తు




న్నాయ్.

ఆడపడుచుల ఈసడింపులు ఆమెని దహించేస్తున్నాయ్.

తోటి కోడళ్ళ వెటకారాలు ఆమెని పాతాళంలోకి తొక్కేస్తున్నాయ్.

'ఏమిటి తన తప్పు!'

తను కట్టింది ఫారన్ నైలక్స్ చీర వేసుకొంది స్లీవ్‌లెస్ బ్లౌజ్.

తను జల్లుకుంది ఫారెనుంచి తెప్పించిన స్ప్రే!

తన కళ్ళల్లో వెలుగు. ఈ వెలుగు ఎక్కడిది? అసలు తనకు ఇలాంటి స్థితిలో ఇలాంటి వేషం ఇష్టమా? ఇంతటి అలంకరణమీద మోజా? తన జడలో తురుముకొన్న ఈ మల్లెల వాసన వెనక నిజం ఏమిటి?

భర్త చివరిదశలో ఉన్నప్పుడు భార్యగా తను చేసింది ఏమిటో కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కొందరికి కోపం తెప్పించవచ్చు.

కొందరికి సూటిపోటి మాటలు మాట్లాడే అవకాశం కల్పించవచ్చు

మొన్నటివరకూ ఎలా ఉంది తను.

నిన్నటినుంచీ ఏమిటీ మార్పు.

ఇలా ఎందుకు జరుగుతోంది.

ఆలోచించే వాళ్ళెవరూ?

పైకి కనిపిస్తున్న దాన్ని కడిగేయటం తప్ప వీళ్ళకి చేతనయిందేమిటి?

మొన్నటి వరకూ తను కట్టింది మామూలు నేతచీర! వేసుకొంది మామూలు జాకెట్.

చల్లుకొంది ఫారెన్ స్ప్రే కాదు-కన్నీటి ప్రవాహంలోంచి ఒలికిన నీటి బిందువులు.

తన కళ్ళల్లో ఉన్నదా వెలుగు—

అందులో కాటికంత చిక్కని చీకటి.

ఆయన ఇక్కడ ఉండేది కొన్ని రోజు

లట-సంవత్సరాలు కాదు-కనీసం నెలలూ కాదు—రోజులు!

ఆయనే చెప్పారు రహస్యంగా — ఆ రహస్యం ఎవరికి తెలుస్తుంది. చెప్తే వీళ్లు నమ్ముతారా?

మొన్న ఎవరూ లేనప్పుడు ఒంటరిగా తనతో ఆయన చెప్పింది ఏమిటి.

తను ఎలాగూ వెళ్ళక తప్పదు-అనంతంలోకి. ఆ అంతిమ క్షణాల్లో తను యిలా నిస్తేజంగా, నిర్వీర్యంగా, నిరుత్సాహంగా కనిపించకూడదట. ఇదేంకోరికో! నిండుగా కనిపించాలిట!

ఈ వేషం అంతా ఆయన కోరికమీద వేసుకొన్నదే.

భార్యగా ఆయన కోరిక తీరుస్తోంది!

అది తప్పా?

తనిలా విషం బిళ్ళమీద పంచదార పూతలా ఉండటం ఆయన అంతిమ క్షణాల్లోని ఆఖరి కోరిక. ఆ కోరిక తీర్చటం తన విధి. తనలోపల ఎన్నెన్నో బాధల అగాధాలు — వాటన్నిటినీ కప్పుతూ తను ఇలా ఉండటం .. ఆ తీపి పూత కరిగి పోయాక తనకు మిగిలేది — విషం.

చీకటిలాంటి విషం.

ఈ వ్యధ ఎవరికి తెలుస్తుంది?

ఎలా తెలుస్తుంది?

(నా బావమరిది ప్రకాశరావు స్మృతికి - కన్నీళ్ళతో అంకితం.

—రచయిత)